# అభ్యాగతి

ఆసుపత్రి గోడలమీద సాయంకాలం ఎండ పాకుతోంది. వరండా అంతా దీపాలు వెలిగించినట్లుంది.

'మళ్లీ వస్తా బాబాయి...' కల్పన మాటలు చెవుల్లో గింగురు మంటున్నాయి. రోజూ వింటున్న మాటలే ఈ రోజు కొత్త అర్థాలు సంతరించుకుంటున్నాయి. కాఫీ తాగగానే వక్కపొడి తెచ్చిపెట్టేది కల్పన. డబ్బా అక్కడపెట్టి 'మళ్లీ వస్తాబాబాయి...' అని ఎన్నిసార్లో అన్నది. కాని ఈ రోజు ఆ మాట వింటూనే గోపాలాచారి కంగారుగా చూస్తూ 'వద్దమ్మా వెళ్లద్దు...ఇక్కడే ఉండాలి...' అంటూ గొణుగు తున్నాడు. కల్పన వెళితే తిరిగి రాదేమో అన్న భయం తొంగి చూస్తోంది. తాయారమ్మ దూరంగా బల్లమీద కూర్చుని గుడ్డలో నీళ్ళు కుక్కుకుంటున్నది. చంద్రం నిర్లిప్తంగా ఉన్నాడు.

'డాక్టరుగా రెక్కడ... ఇంతవరకు రాలేదు??' గోపాలాచారి చేతి గడియారంవంక, గోడ గడియారంవంక తేరి పారజూస్తున్నాడు. గోడ గడియారం ఎప్పుడో ఆగిపోయింది. పైన బూజుగూడ పట్టింది. సాలీడు కిందకు జారి పడిపోకుండా మెల్లిగా పోగు వెంబడి పైకి పోవటా నికి ప్రయత్నం జేస్తోంది.

రాత్రి పడుకునేముందు గోపాలాచారి లైటు తియ్యగానే ఏ బల్ల క్రిందనుంచో, మంచం క్రిందనుంచో కల్పన మెల్లిగా వచ్చేది.

'ఇక్కడే ఉన్నా బాబాయి...' అనేది.

'ఆసినీ... వెళ్లి నిద్రపొమ్మంటే మళ్లీ వచ్చావా...?'

'నువ్వు వద్దన్నా... వస్తా బాబాయి...' గోపాలాచారి గుండె గతుక్కుమంటుంది. గబుక్కున కల్పనను బుజాన వేసుకుని 'నిన్ను వకసారి రావద్దన్నాను...అయినా వచ్చేశావు... చెంపలు వేసు కున్నాగా... ఇంకెప్పుడూ అనను...' అంటాడు. మళ్లీ చెంపలు వేసు కుంటాడు. తాయారమ్మ చూచి 'ఏంపని అది...చిన్నపిల్లల ఎదుట అట్లా చెంపలు వేసుకుంటారా... అయినా దాన్ని మీరెప్పుడు రావద్ద న్నారు కనక...' అంటుంది.

'మీకు తెలియదులెండి...మొదట్లో రావద్దన్నాను...' అంటూ గోపాలాచారి పుస్తకం చదువుతూ కూర్చుంటాడు. తాయారమ్మ మెద లకుండా కల్పనను తీసుకుని వెళ్లిపోతుంది.

'చంద్రం డాక్టరుగారికి మళ్లీ ఫోనుచేస్తాను. లేకపోతే వక్క సారి స్కూటరుమీద పోయివస్తాను...ఎంతోసేపు పట్టదు...మీరు ధైర్యంగా వుండండి!' గోపాలాచారి తనకు ధైర్యం చెప్పుకుంటున్నాడో ఆ దంపతులకు ధైర్యం చెబుతున్నాడో ఎవరికీ అర్థం కాలేదు. కల్పన కళ్ళు మూస్తూ తెరుస్తోంది. ఎవరివంక సరిగ్గా చూడటంలేదు. కొంచెం పక్కకువత్తిగిలింది. చేతికి "గ్లూకోజు" ఎక్కిస్తున్న ఇంజక్షను సూది ఊడిపోయింది.

'తొందరగా నర్సును పిలుచుకురండి. మళ్లీ పెడుతుంది... గ్లూకోజు ఆపకుండా ఇవ్వాలని డాక్టరుగారు చెప్పారు...' ఇదే అవస్థలో

వున్న పక్కమంచం తాలూకు మనిషి చెప్పాడు. ఆచారి కల్పన వంక చూశాడు. నాలుగేళ్ల పిల్ల నిస్సహాయంగా పడివున్నది. ఆవేదనపడు తోంది. అప్పుడే ఆసుపత్రిలో చేర్చి వారంరోజులు దాటింది. జ్వరం తగ్గలేదు. మగత తగ్గలేదు. వైద్యం చెయ్యటానికి సుస్థి ఏమిటో నిర్ధారణ కాలేదు.

'మళ్ళీ వస్తా... బాబాయి...' కల్పన కళ్లు ఆచారివంక చూశాయి. 'తల్లీ నువ్వు వెళ్ళద్దు... నువ్వెళితే నేను బతకలేను... ఆ మాటనద్దు...' ఆచారి మాటలు పెదిమలదాకా గూడా రాలేదు. పిచ్చియెక్కినవాడిలా పరుగెత్తాడు నర్సుకోసం. వరండా అంతా చూశాడు. ఆ ప్రాంతాల్లో ఎక్కడా నర్సుగాని, డాక్టరుగాని కనిపించలేదు. చౌకీదారుని అడిగాడు. తెలియదన్నాడు. పూలమొక్కలు సర్దుతున్న మాలిని అడిగాడు. తల అడ్డంగా తిప్పాడు. గది గోడలమధ్య ఎందరో జీవన్మరణాల మధ్య ఊగిసలాడుతుంటే పూలమొక్కలకు నింపాదిగా కుదుళ్ళు చేస్తున్నాడు ఇతను. గోపాలాచారికి విచిత్రంగా తోచింది. కళ్ళల్లోకి నీళ్ళువచ్చి వరండా అంతా తిరుగుతున్నట్లు కనిపిస్తోంది. రుమాలుతో కళ్ళు అద్దుకుని దూరంగా ఒక నర్సు కనిపిస్తే ఆమె దగ్గరకు పరుగెత్తాడు.

'సిస్టర్... సిస్టర్... వక్కసారి రావాలి...'

'ఎక్కడికి...'

చెప్పాడు.

'ఆ వార్డు నాదికాదు'

'అట్లా అనద్దు సిస్టర్... వక్కసారి రండి...' బతిమిలాడుతున్నాడు.

'నేను చెప్పానుకదయ్యా... నాకు లేనిపోని మాట వస్తుంది...'

'మా పాప... కల్పన... ఏం చెప్పను సిస్టర్... చాలా ప్రమాద పరిస్థితిలో ఉన్నది... ఎట్లాగయినా బ్రతికించుకోవాలి... మీరు రాక పోతే అపాయం సిస్టర్...'

'నేను రాకూడదని చెప్పటంలా... అక్కడన్నీ ప్రాణాపాయకర మైన కేసులే... ఏదన్నా అయితే నన్నే అంటారు...'

'ఏదన్నా అయితేనా...' గోపాలాచారి పళ్ళు పటపటా కొరికాడు.

'ఏదన్నా అయితే చంపేస్తాను...'

'నా భయంకూడా అదే...' నర్సు భయపడుతూ అతన్ని తప్పించుకుని వెనక్కుపోయింది. గోపాలాచారి ముందుకు దూకినవాడు వెనకకు తగ్గాడు. నర్సు మరి కొంచెం వెనక్కుపోయి నిలబడింది!

'సిస్టర్... ఏమయింది... వాడేమన్నాడు... రాస్కెల్...' ఒక ఆసుపత్రి ఉద్యోగి ముందుకు వచ్చాడు. ఆమె కళ్ళలోకి నీళ్ళు వచ్చాయి.

'ఏడుస్తారెందుకు... చెప్పండి... ఏమన్నాడు...' అతను గట్టిగా అడుగుతున్నాడు. 'అతను ఏమీ అనలేదు రావుగారూ... నా చేతులకు నేనే సంకెళ్ళు వేసుకున్నాను...' నర్సు రాయిలా అక్కడే నిలబడింది.

గోపాలాచారి పరుగెత్తుతున్నాడు కాలుకాలిన పిల్లిలా. గడియారం ఎక్కడో ఠంగున గంటకొట్టింది. తెల్లబోయి చూశాడు. 'ఆడే గడియారాలుగూడా వున్నాయా ఇక్కడ...' గోపాలాచారి గొణుక్కుంటూ మళ్ళీ కల్పన దగ్గరకు వెళ్ళాడు. తపనపడిపోతోంది పాప.

చంద్రం బయటకు చూస్తున్నాడు, మబ్బులవంక. పైనఎగిరే పక్షులవంక. తాయారమ్మ మంచం చుట్టూరా తిరుగుతోంది. నదీ ప్రవాహంలో కొట్టుకుపోతున్న ఆప్తురాలిని రక్షించలేక వడ్డున నిలబడ్డ ట్లున్నది కల్పనవంక చూస్తుంటే.

'అమ్మా...' కల్పన మూలుగుతున్నట్లు వినబడింది. తాయారమ్మ ఉలిక్కి పడింది.

'పిలిచావా తల్లీ... ఇక్కడే ఉన్నానమ్మా...' తాయారమ్మ కల్పన ముఖంలోకి చూసింది.

'బాబాయి...' కల్పన పెదిమలు మెల్లిగా కదిలినాయి. గోపాలా చారి శిలా విగ్రహంలాగా నిలబడ్డాడు. చంద్రం ముందుకు వచ్చాడు. 'మీరు చూస్తూ వుండండి... ఇప్పుడే ఇంటికివెళ్ళి వస్తాను...'

'ఈ పరిస్థితిలో మీరు ఇంటికి పోతారా...'

'అయిదు నిమిషాల్లో వస్తాను...' అతను బయలుదేరాడు 'గోపాలా చారి ఇక్కడే వున్నాడుగా...'

తాయారమ్మ తృళ్ళి పడింది. కల్పనవంక సూటిగా చూడటానికి చంద్రం భయపడుతున్నాడు.

'చంద్రం నువ్వేం కావాలంటే అది తెస్తాను... నువ్వు ఎక్కడికి పోయిరమ్మంటే అక్కడికి పోతాను.... నువ్వు మట్టుకు ఇక్కడినుంచి కదలవద్దు... ప్లీజ్...' ప్రాధేయపడుతున్నాడు గోపాలాచారి.

తాయారమ్మ చంద్రంతో మాట్లాడాలంటే భయపడుతోంది. ఆమెకు అతని ప్రవర్తన ఈ మధ్య మరీ విడ్డూరంగా కనిపిస్తోంది. కల్పన పుట్టి నప్పటి నుండి మార్పు కనిపిస్తున్నా తను సమాధాన పరుచుకుంది. తనంటే ప్రాణంగా చూసుకుంటున్నా కల్పన ప్రస్తావన రాగానే ముభావంగా ముక్త

సరిగా ఉంటాడు. పరధ్యానంగా సమాధానం చెపుతాడు. సత్యవతి పుట్టిన ప్పుడు ఇట్లాగే ఉన్నాడా? టెలిగ్రాం ఇస్తే మర్నాడు పొద్దునకల్లా పరుగె త్తుకువచ్చాడు. దోమతెర, చిన్న గౌను, బిస్కట్లు, చాక్లెట్లు... పెట్టెనిండా అవే... పురిటి గదిలోకి వచ్చేశాడు సూటిగా. "నూనెలో ముఖం చూసు కోవాలి... అప్పుడే పాపన చూడకూడదు" అని ఇంటిల్లిపాది వాదించినా వినిపించుకోకుండా గదిలోకి వచ్చేశాడు పాపను చేతిల్లోకి తీసుకున్నాడు. పెద్ద బొమ్మ చేతిలో పెట్టాడు ముద్దు పెట్టుకున్నాడు. చొక్కా తడిసింది, చూసుకోలేదు, పిల్ల దొడ్డికివెళ్లి చెయ్యంతా అంటినా పట్టించుకోలేదు

'పాపతో మాట్లాడావా... ఏమంది... ఏం పేరు పెట్టమంది... ఇంతకాలం ఎక్కడున్నానంది...? ఎదురుచూసి ఎదురుచూసి ప్రాణం విసిగి పోయిందని చెప్పావా... ఎన్నేళ్ళు? అయిదేళ్ళనుంచి కదూ ఎదురు చూసింది...' చంద్రం మాట్లాడుతుంటే పెళ్ళయి ఎన్నేళ్ళయిందా అని లెక్క సరి చూసుకుంటోంది.

'నే నెంత కష్టపడ్డానో అడిగారా...?' అంది.

'నీకేం కష్టం... దర్జాగా కన్నావు... పడుకున్నావు కష్ట పడింది ఇరుగుపొరుగువాళ్ళు...' అన్నాడు చంద్రం. 'కొద్దో గొప్పో కష్టపడింది నేను...' తాయారమ్మ నవ్వుకుంది.

'పాలివ్వటం చేతనయిందా...' చంద్రం తాయారమ్మ కళ్ళల్లోకి సూటిగా చూస్తూ మెలిగా చిలిపిగా అడిగాడు.

'చేతకాకపోతే ఎవరినన్నా అడిగి నేర్చుకుంటా లెండి... మీరేం నేర్పక్కరలేదు.,. కొంచెం సేపు బయటకు నడవండి...' అంది తాయా రమ్మ గుక్క పట్టుతున్న పాపను తీసుకుంటూ.

తాయారమ్మ చంద్రాన్ని గది బయటకు పంపటం కష్టం అయింది. అట్లాంటిది కల్పన పుట్టినప్పుడు అంతా వ్యతిరేకమే. మొదటి పురుడని పుట్టింటికి వెళ్లినా, రెండో పురుడు ఇక్కడే పోసుకుంది. పురిటికని ఆసుపత్రిలో దించిన తర్వాత చంద్రం అటుపక్కకు వెళ్లిందే అరుదు. సాయంత్రం నాలుగు గంటలకు అందరితోపాటు వచ్చి, 'ఏమన్నా కావాలా...' అని అడిగి వెళ్ళేవాడు... అంతే సత్యవతిని భుజాన వేసుకు వచ్చాడు. సత్యవతికి ఇంకా ఏడాది వెళ్ళలేదు. మాటలు రాలేదు. తప్ప టడుగులు వేస్తోంది మంచం పట్టుకుని ఆ చివరనుంచి ఈ చివరదాకా పడుతూ లేస్తూ నడిచేది.

'పాలు బైక కి పట్టండి ..' అంది తాయారమ్మ.

'ఊ ..' చంద్రం మాట పెడసరంగానే ఉన్నది. ఎందుకో అర్థం అయ్యేది కాదు. కల్పన కడుపున పడ్డదని తెలిసినప్పటి నుండ్ ఈ మార్పు. సత్యవతికి వంట్లో బాగాలేగని డాక్టరుగారి దగ్గరకు వెళ్ళారు ఆరోజు. డాక్టరు పరీక్ష చేసింది. బయటకువచ్చి చీటీ వ్రాస్తూ పేరడిగింది. చెప్పాడు. ఉద్యోగం చెప్పాడు.

'భయపడాల్సిందేమీలేదు ఈ మందులు వాడండి .. మూడో నెల ' అంది డాక్టరు.

'మూడు కాదండి . అయిదోనెల ..' అంటూ సత్యవతిని ఎత్తుకున్నాడు. డాక్టరు చంద్రం వంక చూసి ఫక్కున నవ్వింది. 'పాపకు కాదయ్యా .. తల్లి సంగతి నేను చెప్పేది' అన్నది. తాయారమ్మ తల దించేసుకున్నది. చంద్రం నిర్ఘాంతపోయాడు. మళ్ళీ ఇంత తొందర లోనా ? నమ్మలేక పోయాడు. ఇంటికి బయలుదేరారు.

'నాతో ఎందుకు చెప్పలేదు ' చంద్రం దారిలోనే అడిగాడు.

'నాకు తెలుసు కినకనా...' తాయారమ్మ రిషా చక్రంవంక చూస్తూ మాట్లాడుతోంది.

'నీకు తెలియకపోతే నాకు తెలుస్తుందా...'

'ఏమో ఆ రోజులుగూడా వస్తాయేమో...' చంద్రానికి వచ్చిన కోపంఎగిరిపోయిందిగాని క్షణం ఆలోచనలో పడిపోయాడు. దారిలో మందులు కొన్నాడు. వైద్యం ఆనాటినుంచి చాలాకాలం సాగింది. అనేక రకాలయిన బిళ్ళలు తెచ్చాడు. వైద్యం సాగుతోంది. తాయారమ్మ ఆరోగ్యం పెరుగుతోంది పసిపాపతోపాటు. కాని చంద్రంలో ఉత్సాహం సన్నగిలి బెంగపడుతున్నట్లు కనిపించేవాడు. నెలలు నిండుతున్నకొద్దీ కలహాలుగూడా పెరుగుతున్నాయి. ఈ కలహాలకీ గోపాలాచారికీ సంబంధం ఉన్నదేమోనని కొంతకాలం భయపడింది తాయారమ్మ. చంద్రానికి ప్రాణ స్నేహితుడు అతను. కావాలనే తనింట్లో గది యిచ్చి ఉంచుకున్నాడు. వచ్చిన కొత్తలో కాఫీ టేబిలుమీద పెడితే 'ఎవరనుకుంటున్నావు అతను... కాఫీ టేబులుమీద పెట్టి పోవటానికి ..చేతికియ్యి...' అని గదమాయించాడు. ఆదివారం వచ్చినా పండగ వచ్చినా ఇక్కడే భోజనం. క్యారం బోర్డు, పేకాటలు అన్నీ ఇక్కడే. ఒకసారి పాపను గోపాలాచారి ఎత్తుకోబోతే గుక్కలుపెట్టి ఏడిచింది. 'ఏడవకూడదు...మామయ్య...'అంటూ తాయారమ్మ చెప్పబోతే చంద్రం ఎగిరిపడ్డాడు. 'మామయ్య కాదు బాబాయి...నా తమ్ముడు ఇతను...నీ తమ్ముడు కాదు...' అన్నాడు. అట్లాంటి మనిషి గోపాలాచారిమీద విసుక్కుంటున్నాడు. గంటలతరబడి రహస్యంగా మాట్లాడుకుంటూ తను రాగానే ఆగిపోతారు. ఎందుకో కారణం తెలియదు. తను అతనితో చనువుగా వుండటంవలన కాబోలు

అనుకుని అతనితో మాటలు తగ్గించింది. ఇంకా కేకలు వేస్తుండేవాడు. అతని ధోరణి అర్థం అయ్యేదికాదు. ఒకళ్లను ఒకళ్లు అనుమానించుకునే టంత నీచానికి దిగజారిపోయామా! అని ఆశ్చర్యపోయేది.

కల్పన పుట్టినరోజున తెల్లవారుజాము మూడింటికి ఫోనుచేస్తే సాయంత్రం నాలుగింటికి అందరితోపాటు చూడటానికి వచ్చాడు చంద్రం. పాపవంక భయపడుతూ చూశాడు, దోషి న్యాయాధికారిముందు నిల పడ్డట్లుగా బెరుకుగా ఉన్నాడు. అప్పటినుంచి ఇదేధోరణి, అయినా పాపకు జలుబు చేస్తేచాలు, పెద్దపెద్ద డాక్టర్లదగ్గరకు పరుగెత్తుతాడు, మందులు గుప్పిస్తాడు. కాని పిల్లదగ్గర కూర్చోడు. దగ్గరకు తీసుకోవటానికి జంకుతాడు...

తాయారమ్మ వద్దంటున్నా వినిపించుకోకుండా ఆసుపత్రినుంచి బయటకు వచ్చాడు. టాక్సీలో కూర్చుని సూటిగా బార్‌కి వెళ్లాడు. తెలిసిన డాక్టర్లకు ఫోను చేశాడు, ఎవరూ పలకలేదు. విస్కీ తాగాడు. సోడా తెస్తే వద్దన్నాడు. ఇరవైరూపాయల కాగితం అక్కడ పడేసి చిల్లరకోసం చూసుకోకుండా వచ్చాడు.

చంద్రాన్ని చూడగానే గోపాలాచారి ముఖం విప్పారింది. 'ఇప్పుడే నర్సు వచ్చింది చంద్రం...మళ్లా గ్లూకోజు ఇచ్చింది...'

'ఏ నర్సు...'

'ఇప్పుడే కొత్తగా డ్యూటీలోకి వచ్చింది...'

'మైగాడ్' చంద్రం గబగబా నడిచి పక్కనే ఉన్న స్టూలుమీద కూర్చున్నాడు.

'ఈ రాత్రి గడిస్తే భయంలేదన్నారు..'

'గడుస్తుంది..తప్పక గడుస్తుంది..' చంద్రం దుఃఖంగా చూస్తూ.. 'పగళ్లూ, రాత్రుళ్లూ మనకోసం ఆగుతాయా..' అన్నాడు.

ఇంతలోకి డాక్టరు వచ్చాడు. పరీక్ష చేశాడు. ఇంజక్షను ఇచ్చాడు పాప కాలుగూడా కదిలించలేదు.

'విశ్రాంతి ఆవసరంవానికి:..' అర్థం ఏమిటో చంద్రానికి తెలియలేదు.

గోపాలాచారి మంచంమీదనే కూర్చున్నాడు. మాటా పలుకు లేకుండా అలా ఎంత సేపు కూర్చున్నారో ఎనిమిది గంటలయిపోయింది. క్యారియర్లతో అన్నాలు తెచ్చుకుంటున్నారు అక్కడివాళ్ళు.

'చంద్రం...మీరుగూడా పోయి భోంచేసి రారాదా... హోటలుకు పోయి త్వరగా రండి...' అన్నాడు గోపాలాచారి. 'మీకేం భయంవద్దు నేను చూస్తుంటాగా...' అన్నాడు. మాట్లాడకుండా లేచారు ఇద్దరూ. చంద్రం వెనక్కుతిరిగి చూడలేదు.

భోజనం చెయ్యటానికి హోటల్లో ఖాళీ దొరక లేదు. వరండాలో సోఫాలో కూర్చున్నారు.

'కల్పనంటే అదోలా ఉంటారు...ఎందుకని...' తాయారమ్మ ఉండబట్టలేక అడిగింది కిటికీ గుండా బయటకుచూస్తూ.

'మామూలుగానే ఉన్నానే...'

'సత్యవతిని చూసినట్లు చూసుకుంటున్నారా...?'

'చూడక...?'

ముఖంతప్పించి మాట్లాడకండి...ఇటుచూసి చెప్పండి...' చంద్రం తాయారమ్మ కళ్ళల్లోకి చూశాడు.

'చెప్పనా... ?'

'ఊఁ...!'

'చెప్పి నా గుండెబరువు తగ్గించుకుంటానుగాని... ఆ బరువు నువ్వు మొయ్యగలవా...'

'అట్లా మాట్లాడుతున్నారేమిటండి... నా కెందుకో భయంగా ఉంది....'

చంద్రం ముఖం పక్కకు తిప్పి మెల్లగా మాట్లాడుతున్నాడు. 'గోపాలాచారి గురించి నువ్వేమనుకుంటున్నావు....?' తన అనుమానం ఖాయమవుతున్నదని భయపడింది తాయారమ్మ. ఆందోళనగా చూసింది. 'నాకు ఎంత ప్రాణస్నేహితుడో తెలుసుగా.... అనుకోకుండా నా అశాంతికి కారణం అయ్యాడు....'

'ఏం జరిగింది... ?'

'కల్పన నీ కడుపున ఉన్నప్పుడు నీకు తినిపించిన మందులన్నీ టానిక్కులనుకుంటున్నావు కదూ...'

'అవును... !'

'అన్నీ టానిక్కులుకాదు... గోపాలాచారి నేను కలిసి ఆలోచించుకుని...కల్పన రాకుండా వుండేందుకు చేసిన ప్రయత్నాల రూపం అవి... అందు కోసం డాక్టరును సంప్రదించి వాడిన మందులవి... అందుకనే

కల్పన ముఖంలోకి చూడలేకపోతున్నాను... కల్పన కోరుకుంటే రాలేదు... వద్దన్నా ఎదిరించి వచ్చింది...' చంద్రం ముఖం గంభీరంగా వున్నది. తాయారమ్మ కుప్పగా కూలిపోయింది. అతనిమీదకు వరిగిపోయింది

'చెపితే మీరు బాధపడతారని అనుకున్నాగాని చెప్పక మీకింత చిత్రహింస కలగచేస్తానని తెలుసుకోలేకపోయాను...మీరిచ్చిన ఆ మందులు నాకు తెలుసు...నేను వాటిని మింగలేదు...పారేశానండీ...' వణికిపోతూ అతని చేతిలో చెయ్యివేసి గట్టిగా పట్టుకుంది.

'చంద్రంగారు ఎవరుసార్...ఫోనువచ్చింది..' హోటలు కుర్రాడు పిలుస్తున్నాడు...' ఆసుపత్రి నుండి సార్...తొందరగావచ్చి మాట్లాడమంటున్నారు...'

'అక్కడికే వస్తున్నామని చెప్పు' చంద్రం తాయారమ్మను నడిపించుకుంటూ హోటలు బయటకు వచ్చాడు. 'ఈచరాచర జగత్తులో జరిగేవాటికి తాను కర్త కాగలనని అనుకున్నాడా ?...తనకు ఇంతటి అహంకారం ఎట్లా కలిగింది!..?' చంద్రం లోలోన ప్రశ్నించుకుంటూ ఆసుపత్రికి చేరాడు.

'మళ్లీ వస్తా బాబాయి ..' కల్పన మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి. నిజం గోపాలాచారికి చెప్పాలి. కల్పనను వేయి చేతులతో, వేయి కళ్ళతో ఆహ్వానించాలి. చేతులు చాచుకుంటూ ముందుకు నడుస్తున్నాడు.

డాక్టరును చూడటానికి ముఖంవాచిన చంద్రానికి నలుగురు డాక్టర్లు, అయిదుగురు నర్సులు కనిపించారు అన్నీలైట్లే. అయినా అంతా చీకటిగా వున్నది. చంద్రం నిర్లిప్తంగా నక్షత్రాల వెనక పెంజీకటిలోకి చూశాడు. 'మళ్లీ వస్తా బాబాయి...'అన్న మాటలు ఎక్కడినుంచో అస్పష్టంగా వినవస్తున్నాయి. గోపాలాచారి చేతుల్లో కల్పన ఎదురయింది.

(ఆంధ్ర పత్రిక 1974)

—: ౦ :—